# 57

# పట్టణము నాశనముకాక మునుపటి పరిస్థితి

## (24:4-14)

యేసు క్రీస్తు తన ఉపన్యాసమును వివిధమైన “సూచనలు లేని” విషయాలతో మొదలుపెట్టాడు. యెరూషలేము నాశనము యూదులకు గొప్ప ఉద్వేగాఘాతమును కలిగించు సంఘటనయై యుండెను, యేసు ప్రవచించిన ప్రవచన నెరవేర్పు కొరకు ఎదురుచూచుచున్నవారు, ఏ సంఘటనయైనా మరియు ప్రతి సంఘటన ఇట్టి నాశనము సంభవింపనై యున్నదనుటకు ఒక సూచనయై యున్నదని అనుకొందురు. ఆయనను వెంబడించుచుండినవారు తమ మనస్సుల్లో అపార్థంచేసికొన కూడదని యేసు ఆశించుచుండెను, గనుక వారిని తప్పుదోవపట్టించగల సూచనల గూర్చి ఆయన మొదటనే వారిని హెచ్చరించాడు.

### కలవరపడవద్దు (24:4-8)

**4యేసు వారితో ఇట్లనెను-ఎవడును మిమ్మును మోసపరచకుండ చూచుకొనుడి.**
**5అనేకులు నా పేరట వచ్చి-నేనే క్రీస్తునని చెప్పి పలువురిని మోసపరచెదరు. 6మరియు**
**మీరు యుద్ధములనుగూర్చియు యుద్ధసమాచారములను గూర్చియు వినబోదురు; మీరు**
**కలవరపడకుండ చూచుకొనుడి. ఇవి జరుగవలసియున్నవి గాని అంతము వెంటనే రాదు.**
**7జనముమీదికి జనమును రాజ్యముమీదికి రాజ్యమును లేచును. 8అక్కడక్కడ కరవులును**
**భూకంపములును కలుగును; ఇవన్నియు వేదనలకు ప్రారంభము.**

**వచనములు 4, 5.** *అబద్ధ క్రీస్తులు.* ఆయనను వెంబడించుచుండినవారు అబద్ధ క్రీస్తుల చేత, వారే మెస్సీయాలై యున్నారని నటించువారి వలన పెడదోవపట్టకూడదని, **యేసు** వారిని హెచ్చరించాడు (చూడు 24:23, 24). **అనేకులు** ఈ అబద్ధ ప్రవక్తలను వెంబడించినప్పటికిని, యేసు శిష్యులు మాత్రం అలా వెంబడించకూడదు. 16:13-20లో గల వారి సంభాషణ మొదలైనప్పటి నుంచి కూడ, వాగ్దానము చేయబడిన మెస్సీయా యేసే అని శిష్యులు తెలిసికొన్నారు, కానీ రానున్న రోజుల్లో వారి విశ్వాసము బహు తీవ్రముగా పరీక్షింపబడనై యుండినది. యేసు సిలువవేయబడినప్పుడు వారు తమ నాయకుని కోల్పోవుటతో వ్యవహరించుట వారికొక గొప్ప సవాలై యుండును. వారు ఎదుర్కొననై యుండిన సమస్త సమస్యలను పునరుత్థానము పరిష్కరించదు.[1]

మొదటి శతాబ్దములో **అనేక** మంది అబద్ధ మెస్సీయాలు మరియు తిరుగుబాటుదారులైన ఇతర నాయకులు, తరచుగా వారితో కూడ సైన్యములను పోగుచేసుకొనుచు బయల్దేరారు. రబ్బాన్ గమలీయేలు ఇటువంటి వారిలో ఇద్దరి గూర్చి ప్రస్తావించాడు: థూదా మరియు గలిలయవాడైన యూదా. ఎట్టకేలకు వీరు హతమార్చబడిరి, గనుక వారి అనుచరులు చెల్లాచెదరయ్యారు (అపొస్తలుల కార్యములు 5:36, 37).[2] అపొస్తలుల కార్యముల

గ్రంథములో పేర్కొనబడిన మరొకడు, ఒక ఐగుప్తీయుడు, అతడు నాలుగు వందల మంది ఉగ్రవాదులకు నాయకత్వం వహించి అరణ్య ప్రదేశములోనికి వారిని నడిపించాడు (అపొస్తలుల కార్యములు 21:38).[3] ఇటువంటి సందర్భములలో, ప్రతి ఒక్కరు, ఎవరికి వారు, నేనొక **క్రీస్తును** అను ఆలోచన కలిగియుండెనేమో అని నిర్ధరించుట కష్టముగా నుండును. ఏది ఏమైనా, ఇదే ఆలోచనతో ఉండిన ఇతరులు సహితము వచ్చారు. ఒకడు మెస్సీయా బిరుదును సాధికారపూర్వకంగా చెప్పుకొనిన నిర్వివాదాంశమైన నిదర్శనము బార్ కోఖ్బా (క్రీ.శ. 135) సంఘటన వరకు కూడ తలత్తలేదని డొనాల్డ్ ఏ. హేగ్నర్ తర్కించుచున్నాడు.[4]

**వచనములు 6, 7.** *యుద్ధములు యుద్ధ సమాచారములు మరియు ప్రకృతి వైపరీత్యాలు.* **మరియు మీరు యుద్ధములను గూర్చియు, యుద్ధ సమాచారములను గూర్చియు వినబోదురని** చెప్పుచు కూడ యేసు తన శిష్యులను హెచ్చరించాడు. పోరాటాల గూర్చి వారు వింటారు గాని వ్యక్తిగతంగా కలగజేసుకొనరని యేసు పలుకుచున్న మాటలు సూచించుచున్నవి. ఏది ఏమైనా, ఇటువంటి విషయాలు వినువారెవరైనా అవి వారికి కలవరము కలిగించక, వారిని భయపెట్టక మానవు. కాబట్టి, **మీరు కలవరపడకుండ చూచుకొనుడి, ఇవి జరుగవలసి యున్నవి గాని అంతము వెంటనే రాదు** అని ప్రభువు పలికాడు. క్రీ.శ. 70లో జరిగిన యెరూషలేము నాశనమునకు మునుపు బహుసంఖ్యాక పోరాటములు జరిగాయి. వాస్తవమునకు, క్రితం సంవత్సరం, క్రీ.శ. 69, "నలుగురు చక్రవర్తులు సంవత్సరము" అని పేరుగాంచినది. అంతర్యుద్ధము మరియు రక్తపాతముతోనే ఆ సంవత్సరము గడిచిపోయింది. నీరో చక్రవర్తి మరణానంతరము, మరి ముగ్గురు చక్రవర్తులు కేవలము కొంత కాలము మట్టుకే పరిపాలించారు: గల్బా, ఓథో, మరియు విటెల్లియస్.[5] సింహాసనాసీనుడు కావలెనను ఉద్దేశంతో వెస్పేషియన్ వాస్తవముగా యెరూషలేము ముట్టడిని చాలించుకొన్నాడు.[6] శిష్యులు ఇటువంటి వార్తలు విన్నంతమాత్రాన, అప్పుడే "అంతము" (*telos*) వచ్చేసిందని వారు చెప్పుకొనవలసిన అవసరంలేదు (చూడు 24:3).

ఇంకా, **జనము మీదికి జనమును, రాజ్యము మీదికి రాజ్యమును లేచును. అక్కడక్కడ కరువులును భూకంపములును కలుగును** అని చెప్పుచు యేసు తన సంభాషణను కొనసాగించాడు. ఈ భావి సూచన పలుకబడినది మొదలుకొని క్రీ.శ. 70లో యెరూషలేము నాశనమగు వరకు ఈ మధ్య కాలములో ఎక్కువగా రోమా పట్టణము అల్లకల్లోలంతో విధ్వంసమగుచుండగా, యూదయపై ప్రభావము చూపు సంఘర్షణల గూర్చి యేసు తన మనస్సులో తలపోసికొనుచుండవచ్చును.

రోమనులకును యూదులకును నడుమ జరిగిన యుద్ధమునకు దారి తీసిన కొన్ని నిర్దిష్టమైన సంఘటనలను రాబర్ట్ ఏ. గ్యూలిచ్ ప్రముఖంగా ప్రకటించాడు.[7] రోమా సామ్రాజ్య ప్రాంతంలోని ఖజానా అధికారిగా నుండిన ఫ్లోరస్ (క్రీ.శ. 64–66) చేపట్టిన క్రూరత్వములు యుద్ధమునకు తెర దించినవి (క్రీ.శ. 66–74).[8] పౌర హక్కుల గూర్చి యూదులకు విరోధముగా చెలరేగిన సంఘర్షణల సందర్భములో అతడు గ్రీకుల పక్షం వహించాడు. ప్రభుత్వ వ్యయముల నష్టమును పూరించు నిమిత్తము పవిత్ర దేవాలయ కోశాగారములో నుండి కొంత ద్రవ్యము కూడ తీసుకొన్నాడు, వారి అసమ్మతిని ప్రకటించుచుండిన వారిని అరెస్టుచేసి, సిలువవేయించాడు.[9] ఫ్లోరస్ తన అధీనములో నుండిన రెండు

సైనిక దళములను యెరూషలేమునకు కదలించినప్పుడు, వారు అంటోనియా కోటను చేరకుండునట్లు యూదులు వారిని నిరోధించారు. ఈ ముఖాముఖి ప్రతిఘటనలో అనేకులు తమ ప్రాణాలు కోల్పోయారు.[10]

యూదులు ప్రతీకార చర్యగా, రోమా సామ్రాజ్య చక్రవర్తితో సహా అన్యజనుల కొరకైన బల్యర్పణలు అర్పించుట మానివేసారు.[11] ఇట్టి చర్య రాజద్రోహముగా పరిగణింపబడింది. తిరుగుబాటుదారులైన యూదులు రోమా ప్రభుత్వముపై అనేక రంగాల్లో దాడిచేసారు, అనేక మంది సైనికులను హతమార్చారు, మసాద, మాఛెయ్‌రస్, మరియు సిప్రోస్‌తో సహా కీలకమైన సైనిక స్థావర కోటలను కైవశం చేసికొన్నారు.[12] కైసరయ, దెకపొలి, మరియు సిరియా దేశ పట్టణాల్లో అల్లర్లతో కూడిన మరిన్ని దౌర్జన్యకాండలు చెలరేగాయి.[13]

అస్తవ్యస్తముగా నున్న కాలము, భేదాభిప్రాయముల వలన యూదులలో ఏర్పడిన వైరము చేత గుర్తించబడినది. "ఒక ప్రక్క తీవ్రవాదులకును మితవాదులకును మధ్య రాజకీయ శక్తులు విభజింపబడి యున్నవి, సంగ్రామం కోరుకొనేది ఒక పార్టీ అయితే, సమాధానం కోరుకొనేది మరొక పార్టీ మరొక ప్రక్క తీవ్రవాదులు మితవాదులతో విడిపోవుట మాత్రమేగాక, వారిలోనే రెండు గుంపులేర్పడినవని" గ్యాలిచ్ వ్రాస్తున్నాడు.[14]

యేసు ప్రభువు తన భవిష్యద్వాక్కులు పలికినప్పటి నుంచి యెరూషలేము పతనమగు వరకు గల మధ్య కాలంలో రోమా సామ్రాజ్యమందంతటను సంభవించిన అనేక "కరువులు మరియు భూకంపములు" గూర్చి ప్రాచీన కాల చరిత్రకారులు గ్రంథస్థం గావించారు. ఉదా॥ దగ్గరదగ్గర క్రీ.శ. 46లో సంభవించిన కరువు గూర్చి లూకా సువార్తికుడు నివేదించుచున్నాడు (అపొస్తలుల కార్యములు 11:28), ఇది జోసీఫస్ చేత ధ్రువపరచబడుచున్నది.[15] క్లౌదియ చక్రవర్తి పరిపాలనా కాలములో మరొక కరువు సంభవించినది, టేసిటస్ మరియు స్యూటోనియస్, ఇరువురునూ ఈ విషయాన్ని పేర్కొన్నారు.[16] రోమా సైన్యసమూహము యెరూషలేమును ముట్టడించి యున్నందువలన, పట్టణ ప్రహరీ గోడల లోపలనే పట్టబడి యుండినవారిలో ఆకలితో అలమటించిన అనేక మంది పేదలు తమ ప్రాణాలు కోల్పోయారు. ఈ కరువు మూలాన, అతని గణాంకము కొంచెము అతిశయోక్తిగా అనిపించినను, కనీసము ఆరు లక్షల మంది మరణించారని జోసీఫస్ తెలియజెప్పుచున్నాడు.[17]

యెరూషలేము పతనము గూర్చి యేసు ముందుగానే తెలియజెప్పిన నాటి నుంచి అది పతనమైన కాలమునకు మధ్య వ్యవధిలో, అసంఖ్యాకమైన భూకంపములు చోటుచేసుకొని రోమా ప్రపంచానికి భయభ్రాంతులు కలుగునట్లు ఒక్కసారి దానిని కంపింపజేసాయి. ఇతర స్థలముల గూర్చి చెప్పుకొంటే, ఆసియా ప్రాంతములోని లవొదికయ, మరియు ఇటలీ దేశములోని పోంపాయ్ పట్టణములు సహితము (క్రీ.శ. 62) కంపించినవి.[18] భూకంపములు, దేవుని తీర్పునకు చిహ్నములుగా అపొక్రిప సాహిత్యములో తరచుగా పేర్కొనబడినవి (ప్రకటన 6:12; 8:5; 11:13, 19; 16:18). ఈ జాబితాకు, లూకా 21:11 "తెగుళ్లను" మరియు "ఆకాశము నుండి మహా భయోత్పాతములును గొప్ప సూచనలును పుట్టునని" చేర్చుచున్నది.

**వచనము 8. ఇవన్నియు వేదనలకు ప్రారంభము** అని యేసు ఈ సంఘటనల గూర్చి ప్రస్తావించుచున్నాడు. యుద్ధములు, కరువులు, మరియు భూకంపములు అని యేసు చెప్పుచుండగా వినిన శిష్యులు, కలవరపడ కూడదు. ఇవన్నియు భవిష్యత్తులో

సంభవింపనై యుండిన సంఘటనలకు ముందుసూచనలు మాత్రమే. ఒక తల్లి తన బిడ్డను కనుటకు పడు ప్రసవవేదన గూర్చిన రూపకము పరిశుద్ధ బైబిల్‌లో అనేక పర్యాయములు ప్రయోగింపబడినది, అది దేవుని తీర్పు ననుసరించుచు ఆకస్మికముగా సంభవించు అతి గొప్పదైన ఆపదను సూచించుచున్నది.[19] యూదా మతోపదేశకులు మెస్సీయా రాకడను ప్రస్తావిస్తూ, "ప్రసవ వేదన" గూర్చి మాటలాడినప్పుడు, మెస్సీయా తొలి రాకడకు మునుపు యూదులు అనుభవించనై యుండిన శ్రమలను వారు సూచించుచుండిరి.[20] ఈ సందర్భములో, దేవుడు యెరూషలేము విషయంలో తీర్చనై యుండిన తీర్పుకు సంబంధించిన సత్యమును తెలుపుచూ యేసు ఈ పదములను పలికాడు, ఈ సంఘటన యేసు రెండవ రాకడకు మునుపు సంభవించును.

## మీకు కలుగనైయున్న అనేక శ్రమల గూర్చి జాగ్రత్తగా ఉండుడి (24:9–14)

**9అప్పుడు జనులు మిమ్మును శ్రమలపాలుచేసి చంపెదరు; మీరు నా నామము నిమిత్తము**
**సకల జనములచేత ద్వేషింపబడుదురు. 10అనేకులు అభ్యంతరపడి, యొకనినొకడు**
**అప్పగించి యొకని నొకడు ద్వేషింతురు. 11అనేకులైన అబద్ధ ప్రవక్తలు వచ్చి పలువురిని**
**మోసపరచెదరు; 12అక్రమము విస్తరించుటచేత అనేకుల ప్రేమ చల్లారును. 13అంతమువరకు**
**సహించినవా డెవడో వాడే రక్షింపబడును. 14మరియు ఈ రాజ్య సువార్త సకల జనములకు**
**సాక్ష్యార్థమై లోకమందంతటను ప్రకటింపబడును; అటుతరువాత అంతము వచ్చును.**

**వచనము 9.** ప్రజలు వారి పట్ల ప్రవర్తించు తీరు గూర్చి యేసు తన శిష్యులను హెచ్చరించాడు. వారు **శ్రమల** పాలుచేయబడి చంపబడుదురని ఆయన చెసినప్పుడు, ఆ మాటలో గల తమ భావమును ఆయన వారికి బయలుపర్చాడు. అంత్య కాలములో వారెదుర్కొను ఒక శ్రమల కాలము గూర్చి ఆయన మాటలాడుచుండలేదు, కానీ అపొస్తలులైయున్న తామే అనుభవించనై యుండిన హింసల గూర్చి తెలియజెప్పుచుండెను. స్థానిక న్యాయపీఠములు (సన్హెడ్రిన్ మహా సభలు), ప్రాంతీయ పరిపాలకులు, మరియు రాజుల యెదుటికి వారు తేబడుదురు. సమాజమందిరములలో వారు కొరడా దెబ్బలు కొట్టబడుదురు, చెరసాలలో వేయబడుదురు, చివరకు చంపబడుదురు (మార్కు 13:9). వారు సువార్తను ప్రకటించుచుండుటనుబట్టియే ఇదంతా జరుగును (10:17, 18; 23:34పై గల వ్యాఖ్యానము చూడు).

**మీరు నా నామము నిమిత్తము సకల జనముల చేత ద్వేషింపబడుదురని** ప్రభువు సెలవిచ్చాడు (10:22పై గల వ్యాఖ్యానము చూడు). క్రీ.శ. 64లో, నీరో చక్రవర్తి క్రైస్తవులకు పెట్టుచుండిన హింసలను గ్రంథస్థం చేస్తూ, అట్టి హింసలు "ప్రసిద్ధముగా నీతిభ్రంశం కలిగించినవై యున్నవి," వారి మతము "ప్రాణాంతకమైన మూర్ఖపు నమ్మకముతో కూడినదై యున్నది" మరియు వారి అలవాట్లు "నీచాతినీచమును, లజ్జాకరమునై యున్నవని" టేసిటస్ వర్ణించాడు. వారు రోమా పట్టణమును తగులబెట్టారను నేరము వారిపై మోపదగినవారు కానప్పటికిని, నీరో చక్రవర్తి ఈ నిందను వారిపైనే మోపాడు ఏలయనగా "మానవ జాతి వారిని అసహ్యించుకొనినది."[21]

**వచనము 10.** ఈ కాలములో ప్రకటితముకానై యుండిన ఇతర సంఘటనలను

సహితము యేసు ముందుగా తెలియజెప్పాడు: ఎక్కువగా హింసల మూలమున (చూడు 1 పేతురు 1:6, 7; 4:12-19) అనేక మంది క్రైస్తవులు **అభ్యంతరపడుదురు** (*skandalizō*) **వారు యొకనినొకడు అప్పగించి యొకనినొకడు ద్వేషింతురు**. హెచ్. లియో బోల్స్ ఇలా వ్రాయుచున్నాడు,

> వారు హింసింపబడునట్లు అప్పగింపబడినప్పుడు అనేకులు తొట్రిల్లునట్లు చేయబడుదురు; వారికి కుప్పతెప్పలుగా పెట్టబడు కఠోరమైన హింసల నుండి తప్పించుకొనునట్లు కొందరు స్వధర్మభ్రష్టులౌదురు; శిష్యులలో సహితము కొందరు ఇతర శిష్యులను అప్పగించి వారిని హింసకుల చేతుల్లో పెట్టుదురు.[22]

**వచనము 11. అనేకమైన అబద్ధ ప్రవక్తలు** లేతురు, శిష్యులను వారి వెంట కొనిపోవుదురు. ఆది సంఘము అబద్ధ ప్రవక్తల చేత పీడింపబడినది. "మనలను దాసులుగా చేసికొనవలెనని క్రీస్తు యేసు వలన మనకు కలిగిన మన స్వాతంత్ర్యమును వేగు చూచుటకు, రహస్యముగా తేబడి దొంగతనముగా ప్రవేశించిన కపట సహోదరులవలన జరిగినది" అని పౌలు వ్రాసాడు (గలతీయులకు 2:4). పౌలు, సంభవింపనై యుండిన స్వధర్మభ్రష్టత గూర్చి చెప్పుచు, "ధర్మవిరోధ సంబంధమైన మర్మము ఇప్పటికే క్రియచేయుచున్నది" అని పలికాడు (2 థెస్సలొనీకయులకు 2:3, 7). "తమ్మును కొనిన ప్రభువును కూడ విసర్జించుచు, తమకు తామే శీఘ్రముగా నాశనము కలుగజేసికొనుచు, నాశనకరమగు భిన్నాభిప్రాయములను రహస్యముగా బోధించు" అబద్ధ బోధకుల గూర్చి పేతురు హెచ్చరించాడు (2 పేతురు 2:1). యోహాను, క్రీస్తు విరోధి గూర్చి మాటలాడుచు, "అనేకులైన" క్రీస్తు విరోధులు బయలుదేరి యున్నారని సెలవిచ్చుచున్నాడు (1 యోహాను 2:18, 19). "అనేకులైన అబద్ధ ప్రవక్తలు లోకము లోనికి బయలు వెళ్లియున్నారని" కూడ యోహాను హెచ్చరిక చేసాడు (1 యోహాను 4:1). ఆ నాటి నుంచి కూడ లోకము అనేక మంది ఇతర అబద్ధ ప్రవక్తలను చూచినది.

**వచనము 12.** యెరూషలేము నాశనమునకు ముందు **అక్రమము** విస్తరించునని యేసు సెలవిచ్చాడు. అనేక మంది క్రైస్తవులు క్రీస్తు యెడలను ఆయన సంఘము పట్లను కలిగియున్న **ప్రేమలో చల్లారిపోవుదురు**. ఇందుకు ఒక చక్కని ఉదాహరణము ప్రకటన గ్రంథంలో కలదు. అచ్చట యేసు ఎఫెస్సు పట్టణములోని విశ్వాసులను అధికారపూర్వకంగా చీవాట్లు పెట్టాడు ఏలయనగా వారు "మొదట(ట) [వారికుండిన] ప్రేమను వదిలిపెట్టారు" (ప్రకటన 2:4).

**వచనము 13.** స్వధర్మభ్రష్టతకు సంబంధించిన ఆ యా స్థాయిల గూర్చి చర్చించిన మీదట, **అంతము వరకు సహించినవాడెవడో, వాడే రక్షింపబడునని** పలుకుచు ప్రభువు ఆయనను వెంబడించుచుండిన వారికి అభయమిచ్చాడు. ఈ వాగ్దానములో ఒక విశ్వాసి యొక్క నిత్య రక్షణ ఇమిడి యున్నది. ఒకడు "జీవ కిరీటము" పొందుటకు "మరణము వరకు నమ్మకముగా ఉండవలెను" (ప్రకటన 2:10; NIV). "అంతము" (*telos*) అను పదము 3వ వచనములో "యుగ సమాప్తము"ను సూచించుచున్నప్పటికిని (10:22పై గల వ్యాఖ్యానము చూడు), వచనములో అది ఒకని ఐహిక జీవితము యొక్క అంతమును సూచించుచున్నది.

**వచనము 14.** ఇంకా, **మరియు ఈ రాజ్య సువార్త సకల జనములకు సాక్ష్యార్థమై లోకమందంతటను ప్రకటింపబడును, అటుతరువాత అంతము వచ్చునని** కూడ యేసు

సెలవిచ్చాడు. "లోకమందంతటను" (*oikoumenē*) మరియు "అంతము" (*telos*) అను పదములు నిర్వచింపబడు తీరును ఆధారం చేసుకొని, ఈ వచనమునకు రెండు వేర్వేరు విధాలుగా అర్థవివరణ నీయవచ్చును. ఆయన రెండవసారి రాక మునుపు మరియు యుగ సమాప్తి జరుగక మునుపు సువార్త ఈ భూలోకమందంతటను ప్రకటింపబడును అని ప్రభువైన యేసు క్రీస్తు సెలవిచ్చిన మాట సూచించుచున్నదనునది ఒక సాధ్యతమై యున్నది. అలాగైతే, ఈ సందర్భములో, "అంతము" అను పదము మూడవ వచనములో ఇచ్చిన అర్థమునే ఇచ్చును.

యెరూషలేము నాశనము కాకమునుపు సువార్త, రోమా సామ్రాజ్యమందంతటను ప్రకటింపబడుననునది[23] ఇంకా కొంచెము ఎక్కువగా సాధ్యమగు విషయమై యున్నది. పెంతెకొస్తు దినాన, రోమా సామ్రాజ్యమందంతటను నివసించుచుండిన యూదులు మరియు అన్యజనులై యుండి నూతనముగా క్రీస్తునంగీకరించినవారు యెరూషలేములో ఉండిరి (అపొస్తలుల కార్యములు 2:5–12), వారు సువార్త వినుటకును, దానికి విధేయులగుటకును వారికొక తరుణము లభించినది. యేసు క్రీస్తును అంగీకరించిన వారందరిలో అనేకులు వారి వారి స్వస్థలములకు తిరిగి వెళ్లిన తరువాత నిస్సందేహముగా సువార్తను ఆ యా స్థలాల్లో పంచుకొని యుందురు. ఇంకా, హింసల వలన యెరూషలేములో నుండి సంఘము చెదరిపోవుటనుబట్టి సువార్త యూదయ మరియు సమరయ దేశములయందంతటను వ్యాపించినది (అపొస్తలుల కార్యములు 8:4). ఇంకా, అపొస్తలులు చేపట్టిన మిషనెరీ ప్రయాణముల వలన సువార్త అనేక విదేశాల్లో కూడ విస్తరించినది, రోమా సామ్రాజ్యము సువార్తతో ముంచెత్తబడినది. దాదాపు క్రీ.శ. 57లో, "వారి స్వరము భూలోకమందంతటికిని, వారి మాటలు భూదిగంతముల వరకును బయలువెళ్లెనని" చెప్పుచు పౌలు కీర్తనలు 19:4 నుండి ఉల్లేఖించాడు (రోమీయులకు 10:18).[24] అటుతరువాత, దాదాపు క్రీ.శ. 62లో పౌలు, "మీ యొద్దకు వచ్చిన సువార్త, సర్వలోకములో ఫలించుచు," "ఆకాశము క్రింద ఉన్న సమస్త సృష్టికి ప్రకటింపబడినదని" చెప్పుచున్నాడు (కొలొస్సయులకు 1:5, 6, 23). యెరూషలేము – పాత దైవ విధానమునకు ప్రధాన కేంద్రము – క్రీ.శ. 70లో నాశనము చేయబడక మునుపు, నూతన దైవ విధానము యొక్క సందేశము రోమా సామ్రాజ్యమందంతటను చొచ్చుకొనిపోవునని యేసు చెప్పియుండును.

---

సూచనలు

[1]Leon Morris, *The Gospel according to Matthew*, Pillar Commentary (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1992), 597. [2]Josephus *Antiquities* 17.10.5; 20.5.1. జోసీఫస్ మరొక థూదాను సూచించియుండును లేదా కాలక్రమము గూర్చి అతడు తికమక పడియుండును. [3]Ibid., 20.8.6. [4]Donald A. Hagner, *Matthew* 14–28, Word Biblical Commentary, vol. 33B (Dallas: Word Books, 1995), 691. [5]Suetonius *Twelve Caesars* 7.18–22; 8.5–12; 9.7–18. [6]Ibid., 10.4–8. [7]Robert A. Guelich, "Destruction of Jerusalem," in *Dictionary of Jesus and the Gospels,* ed. Joel B. Green and Scot McKnight (Downers Grove, Ill.: InterVarsity Press, 1992), 172. [8]Josephus *Antiquities* 20.11.1. [9]Josephus *Wars* 2.14.6–8. [10]Ibid., 2.15.5.

[11]Ibid., 2.17.2, 3. [12]Ibid., 2.17.2, 7, 8; 2.18.16. [13]Ibid., 2.18.1–5. [14]Guelich, 173. [15]Josephus *Antiquities* 3.15.3. [16]Tacitus *Annals* 12.43; Suetonius *Twelve Caesars* 5.18. [17]Josephus *Wars*

5.13.7. [18]Tacitus *Annals* 14.27; 15.22. [19]కీర్తనలు 48:6; యెషయా 13:8; 21:3; 26:17; 42:14; యిర్మీయా 4:31; 6:24; 13:21; 22:23; 30:6; 31:8; 48:41; 49:22, 24; 50:43; హోషేయ 13:13; 1 థెస్సలొనీకయులకు 5:3. [20]Talmud *Ketuboth* 111a; *Sanhedrin* 97b, 98b; *Shabbath* 118a.

[21]Tacitus *Annals* 15.44. [22]H. Leo Boles, *A Commentary on the Gospel According to Matthew* (Nashville: Gospel Advocate Co., 1936), 461–62. [23]ఈ పదము, *oikoumenē* యొక్క అర్థము కొరకు లూకా 2:1 చూడు. మొదటి శతాబ్దములో, రోమనులు "ప్రపంచమంతటినేలు పరిపాలకులు"గా పరిగణింపబడిరి. (Josephus *Antiquities* 15.11.1.) [24]పౌలు రోమీయులకు వ్రాసిన పత్రికలో, "యెరూషలేము మొదలుకొని చుట్టుపట్లనున్న ప్రదేశములందు ఇల్లూరికు ప్రాంతము వరకు" క్రీస్తు సువార్తను పూర్ణముగా ప్రకటించాడని" అటుతరువాత రచించాడు, కానీ ఆయన ఇంతకు స్పెయిను దేశమునకు వెళ్లలేదని స్పష్టమగుచున్నది (రోమీయులకు 15:18, 19, 23, 24, 28).